

నెల్లూరు : ఆదివారం అర్ధరాత్రి తర్వాత నగరంలో యువకుల ఉత్సాహం

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
సోమవారం, 1 జనవరి 2024

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 31 : ఆదివారం అర్ధరాత్రి గడియారంలో ముల్లు 12 గంటలను తాకిన వెంటనే హ్యాపీ... న్యూఇయర్ అంటూ జిల్లా అంతటా మారుమోగింది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చిన్నా, పెద్ద, యువత కేరింతలు కొట్టారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని సంబరాలు జరుపుకున్నారు. 2023 సంవత్సరానికి వీడ్కోలు చెప్పి 2024 సంవత్సరానికి ఘనంగా ఆహ్వానం పలికారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వ్యాపార కేంద్రాలు, కార్యాలయాలు, చర్చిలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. నూతన సంవత్సరం రాక సందర్భంగా వస్త్రాలు, ఆభరణాలు, వాహనాలు, గృహోపకరణాల వ్యాపారం కళకళలాడింది. స్వీట్లు, కేకుల దుకాణాలు కిటకిటలాడాయి. ఇక, నాయకులు, అధికారులకు, ఆప్తులకు శుభాకాంక్షలు తెలిపే వారి కోసం ప్రత్యేకంగా బొకేలు తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. కొనుగోలుదారులతో నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు కళకళలాడాయి. మందు విందుతో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలకాలనుకునే మందుబాబులు హోటళ్లు, బార్లు, గెస్ట్‌హౌస్‌లు, గార్డెన్లలో సంబరాల్లో మునిగారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

● రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హరి నారాయణన్, జేసీ కూర్మనాథ్, టీడీపీ నేతలు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్ వేర్వేరు ప్రకటనల్లో జిల్లా ప్రజలకు ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపారు.

తాగండి... ఊగండి !

మద్యం దుకాణాలు, బార్ల వేళల పెంపు

నెల్లూరు(క్రైం) : మద్య నిషేధం హామీని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం పండుగలు, ప్రత్యేకమైన రోజుల్లో ఆదాయమే పరమావధిగా అదనంగా మద్యం అమ్మకాలకు అనుమతిస్తోంది. తాగండి.. ఊగండి అన్నట్లు ప్రజలను మత్తువైపు ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో నూతన సంవత్సరం రాక సందర్భంగా ఆది, సోమవారాల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు సాగిస్తోంది. ప్రభుత్వం మద్యం దుకాణాల్లో రాత్రి 12 గంటల వరకు, బార్లలో రాత్రి 1 గంట వరకు అమ్మకాలు చేసేలా ఆదేశాలిచ్చింది. దీంతో అర్ధరాత్రి వరకు మద్యం దుకాణాలు, బార్లు మందుబాబులతో నిండి, ఫూటుగా మందు తాగి ఆ మత్తులో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.

దాబా హోటల్‌లో ఎస్పీ తనిఖీ



దాబాలో మెనూ చార్టును పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

మనుబోలు, డిసెంబరు 31: మండల పరిధిలోని కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న దాబా హోటల్‌ను జిల్లా ఎస్పీ కే. తిరుమలేశ్వరరెడ్డి శని వారం అర్ధరాత్రి తనిఖీ చేశారు. వెంక టాచలం టోల్‌గేట్ వద్ద ఫేస్ వాష్ (లారీ డ్రైవర్ల కోసం ఏర్పా టు చేసిన కార్యక్రమం)ను పరిశీలించేం దుకు ఆయన వచ్చారు. తిరుగు ప్రయా ణంలో దాబా వద్ద ఆగారు. అక్కడ ఉన్న పదార్థాలను, వంట లను పరిశీలించారు. నిల్వ ఉన్న వాటిని వాడరాదని హెచ్చ రించారు. మద్యం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాను నిర్వహించరాదని నిర్వాహకుడికి సూచించారు. నిర్దీత సమయం వరకే దాబా నిర్వహించాలని తెలిపారు. ఆయన వెంట ఎస్‌బీ సీఐ రామకృష్ణ ఉన్నారు.

● **టోల్‌గేట్ వద్ద..**

వెంకటాచలం : జిల్లా ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి వెంకటాచలం టోల్‌గేట్ వద్ద శనివారం అర్ధరాత్రి వాహనాలను తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై పోలీసులు, సెబ్ అధికారులతో కలిసి కార్లు, బస్సులు, ఇతర వాహనాలను ఆయన తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వారి చిరునామా, పూర్తి వివరాలను తెలుసుకుని వేలిముద్రలు సేకరించారు. కారులో తరలిస్తున్న అక్రమ మద్యాన్ని ఎస్పీయే స్వయంగా పట్టుకున్నారు. అనంతరం ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐలు అంకమరావు, రామకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల రాక

బిట్రగుంట, డిసెంబరు 31: 10వ సాగర పరిక్రమ కార్యక్రమంలో భాగంగా షిప్‌లో సముద్ర మార్గం ద్వారా సోమవారం కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల మండలంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు రానున్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ పిలుపునిచ్చారు. బోగోలులో ఆదివారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి, మత్స్యసంపద యోజన పథకాల అమలు, కిసాన్ క్రెడిట్ కార్డు రుణాల మంజూరుపై మంత్రి వివరిస్తారన్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని కోరారు.

జిల్లా మీదుగా 'అమృత్ భారత్'

● మాల్డా టౌన్ - బెంగళూరు వరకు రైలు ● నెల్లూరు, గూడూరు స్టేషన్లలో స్టాపింగ్



బోగీ లోపల స్లీపర్ సీట్ల అమరిక ఇలా..

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 31 : స్లీపర్ కోచ్‌లతో పరుగులు పెడుతున్న 'అమృత్ భారత్' ఎక్స్‌ప్రెస్ రైలు జిల్లా మీదుగా ప్రయాణించనుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మాల్డా టౌన్ నుంచి బెంగళూరు వరకు నడవనున్న ఈ రైలు ఉమ్మడి జిల్లాలోని నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌తో పాటు గూడురులో స్టాపింగ్ ఇచ్చారు. మాల్డా టౌన్ నుంచి ప్రతిరోజూ బయలుదేరనున్న రైలు (నెం.13434) నెల్లూరుకు సాయంత్రం 4.28, గూడురుకు 5.53 గంటలకు రానున్నది. అదేవిధంగా బెంగళూరు నుంచి బయలుదేరే రైలు (నెం.13433) గూడురుకు రాత్రి 9.33, నెల్లూరుకు రాత్రి 10.04 గంటలకు రానున్నది. ఈ ఎక్స్‌ప్రెస్ రైలులో నాన్ ఏసీ స్లీపర్ క్లాస్‌తోపాటు అన్ రిజర్వుడు క్లాస్ సర్వీస్ టికెట్లు అతి తక్కువ ధరకు అందుబాటులో ఉంటాయని విజయవాడ డివిజన్ పీఆర్‌వో మండ్యుష్కర్ తెలిపారు.

● **విస్తృతంగా స్వాగత ఏర్పాట్లు**

మాల్డా టౌన్ నుంచి బెంగళూరు వెళుతున్న తొలి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం ఉదయం 11 గంటలకు నెల్లూరుకు, 12.30 గంటలకు గూడురుకు చేరుకోనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆయా స్టేషన్లలో జిల్లా రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు రైలుకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి మహిళల చెడుగుడు పోటీలు



విజేతలకు నగదు బహుమంతి అందచేస్తున్న వీరరఘు

బిట్రగుంట, డిసెంబరు 31: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప బాడస్‌పేట ది సెంటనరి తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి మహిళల చెడుగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో 10 జట్లు పాల్గొనగా నెల్లూరు డీఎస్ఏ జట్టు విజేతగా నిలిచి రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన అల్లూరు జట్టు రూ.4వేలు, తృతీయ స్థానం లో నిలిచిన ఇస్కపల్లి జట్టు రూ.3వేలు, 4వ స్థానంలో నిలిచిన చంద్రశేఖరపురం జట్టు రూ.2వేలు, 5వ స్థానంలో నిలిచిన ఆర్‌కెజేసీ జట్టు రూ.1000 గెలుపొందారు. వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, యువత అధ్యక్షుడు శ్రీనివాసులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.డేవిడ్‌పాల్, ఎం.సాల్మన్‌రాజ్, దాసరి సురేష్ పాల్గొన్నారు.

7న 'సముద్రతీర కథలు' ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 31 : ప్రముఖ రచయిత పొల్లూరు సుబ్రహ్మణ్యం రచించిన సముద్ర తీర కథలు పుస్తకాన్ని ఈ నెల 7న మైపాడు సముద్ర తీరాన ప్రము ఖుల సమక్షంలో ఆవిష్క రిస్తామని ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ చైర్మన్ ఎన్ బలరామయ్య నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన నివా సంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పుస్తకావిష్క రణ కార్యక్రమ బ్రోచర్లు, పోస్టరు ఆవిష్కరించారు. పొట్లూరు సాహిత్య వేదిక కార్యదర్శి వినుకొండ వెంకటే శ్వర్లు మాట్లాడుతూ సముద్రంపై ఆధారపడే మత్స్య కారుల జీవన విధానంపై ఈ కథలు రాశారన్నారు. సంయుక్త కార్యదర్శి పెరిశెట్ల శివకుమార్ మాట్లాడుతూ సముద్ర కథలు పుస్తకం ఆవిష్కరణ సందర్భంగా సముద్రంపై కవితల పోటీలు నిర్వహిస్తున్నామని, మొదటి మూడు బహుమతులతో పాటు 4 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని, కవులు సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ జీ సుభద్రాదేవి, పొట్లూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల విజేత ఎన్‌డీఎఫ్ జట్టు

బిట్రగుంట: బోగోలులోని రైల్వే సెవెన్స్ ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో జరుగుతున్న జిల్లాస్థాయి సెవెన్స్ న్యూఇయర్ ఫుట్‌బాల్ పోటీల్లో ఆదివారం నెల్లూరు ఎన్‌డీఎఫ్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌కు చేరుకున్న మురగదాస్ మెమోరియల్ జట్టుపై నెల్లూరు ఎన్‌డీఎఫ్ జట్టు ఒక్కగోల్ తేడాతో విజయం సాధించింది. ఆంథోనీ, స్టీవెన్‌కుమార్, ప్రశాంత్‌ల ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు బిట్రగుంట సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు కరిముల్లా, చిట్టిబాబు, మోహన్‌లు బ్రదర్ లుల్లూ పర్యవేక్షించారు. అనంతరం ఆర్సీఎం సిస్టర్స్ చిన్నమ్మ, గీతాకుమారి చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వృషభమా.. జగన్ కళ్లు తెరిపించు!

● ఎద్దుకు అంగన్‌వాడీల వినతి

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 31 : 'సమస్యల పరిష్కారం కోసం మూడు వారాలుగా సమ్మె చేస్తున్నా సీఎం జగన్‌లో మాత్రం మార్పు రాలేదు. వృషభమా నువ్వయినా ఆయన కళ్లు తెరిపించు.' అంటూ అంగన్‌వాడీలు ఎద్దును వేడుకుంటూ వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 20వ రోజుకు చేరుకుంది. సమ్మెపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవటంతో నెల్లూరులోని మైపాడు గేటు నుంచి సత్యనారాయణపురం వరకు అంగన్‌వాడీలు ప్రదర్శన నిర్వహించారు. అక్కడ ఎద్దు కొమ్ములకు వినతి పత్రం కట్టి ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలంటూ నినాదాలు చేశారు. జీతాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఈ వినతిపత్రంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటే పోలీసుల చేత దాడి చేయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిరసనలో ఐద్వా నాయకురాళ్లు పద్మ, శైలజ, రజని, రమ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు సునీత, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, రాంబాబు, చిరంజీవి పాల్గొన్నారు.



నెల్లూరు రూరల్ : వెల్లంటిలో దున్నపోతుకు అర్జీ ఇస్తున్న అంగన్‌వాడీలు

● **వెల్లంటిలో దున్నపోతుకు..**

నెల్లూరురూరల్ : 'జగన్‌కు ఎలాగూ మాపై కనికరం లేదు... కనీసం నువ్వన్నా మా మొర ఆలకించు' అంటూ అంగన్‌వాడీలు దున్నపోతుకు అర్జీ ఇచ్చి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నెల్లూరు రూరల్ మండలం కొత్తవెల్లంటి గ్రామంలో ఆదివారం అంగన్‌వాడీ సిబ్బంది, సీపీఎం నాయకులు సంయుక్తంగా దున్నపోతుకు ఎదురుగా నిలబడి తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. అనంతరం కాగితంపై రాసిన వినతులను దున్నపోతుకు ఇచ్చి జగన్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు పూడిపర్తి జనార్ధన్, పాదర్తి మస్తానయ్య, నాగభూషణమ్మలు పాల్గొన్నారు.

ఇసుక అమ్మకాలు 'ప్రతిమ'కే!

ఖరారైన కొత్త ఇసుక టెండర్లు

నియోజక వర్గాల వారీగా ధరల ఖరారు



నెల్లూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఇకపై ఇసుక తవ్వకాలు, అమ్మకాల బాధ్యతలను ప్రతిమ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొన్నటి దాకా జేపీ సంస్థ అన్ని రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుపుతుండగా కొన్ని నెలల క్రితమే గుడువు ముగిసింది. కానీ అనధికారికంగా రీచ్‌లో ఇసుక తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. దీనిపై ప్రజలు, ప్రతిపక్షాలు ఆధారాలతో సహా బయటపెట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కాగా జిల్లాలో 14 వరకు రీచ్‌లను గుర్తించగా మినగల్లు, పడమటికంభంపాడు, ముదివర్తి, పల్లిపాడు, విరువూరు రీచ్‌లలోనే తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. పెన్నా, సంగం బ్యారేజీల వద్ద డీ సిల్టేషన్‌లో భాగంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం ఈ రీచ్‌లలో ప్రతిమ సంస్థ తమ పేరుతో బిల్లులు ఇస్తూ తవ్వకాలు చేస్తోంది. అయితే ఈ సంస్థ కూడా ఎలక్ట్రానిక్ బిల్లులు కాకుండా మాన్యువల్ బిల్లులనే ఇస్తోంది. స్టాక్ యార్డుల్లోనే ఇసుక విక్రయాలు జరపాలని ప్రభుత్వం సూచించినా చాలా చోట్ల నేరుగా రీచ్‌ల నుంచే ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. అన్ని నియోజక వర్గాలకు ఇసుక ధర, రవాణా చార్జీలను కూడా ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రతి స్టాక్‌యార్డులో టన్ను ఇసుక ధరను రూ.475గా నిర్ణయించింది. దీనికి అదనంగా ప్రతి నియోజకవర్గానికి దూరాన్ని బట్టి రవాణా చార్జీలను నిర్ణయించింది. ఇసుక ధర, రవాణా ఖర్చుకు మించి వసూలు చేసేందుకు వీల్లేదు. కావలి నియోజక వర్గానికి ఒక టన్ను ఇసుకను చేరవేసేందుకు (ఇసుక ధర, రవాణా ఖర్చు కలిపి) రూ.769, ఆత్మకూరుకు రూ.563, కోవూరుకు రూ. 549, నెల్లూరు నగరానికి రూ.549, నెల్లూరు రూరల్‌కు రూ.598, సర్వేపల్లికి రూ.769, వెంకటగిరికి రూ.818, ఉదయగిరికి టన్ను ఇసుక ఖర్చు రూ.803గా నిర్ణయించారు. అయితే ప్రతి చోటా టన్నుకు రూ.200 నుంచి రూ.300 ఎక్కువగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు సర్వేపల్లిలో ఒక ట్రాక్టర్ ఇసుక ధర రూ.4400 ఉండగా రూ.5500 వరకు వసూలు చేస్తున్నారు. మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ కొత్త సంస్థ ప్రతిమకు ఇసుక తవ్వకాల బాధ్యతలు అప్పగించామని, ఆ సంస్థే విక్రయాలు జరుపుతుందని తెలిపారు.

జగన్ దృష్టిలో ముస్లింలు ఓటు బ్యాంకు మాత్రమే

● ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, డిసెంబరు 31: తెలుగుదేశం ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీల కోసం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి నిరుపేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునివ్వగా, జగన్ అధికారం చేపట్టగానే వాటన్నింటినీ నిలిపివేసి ముస్లింలను దగా చేశాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. జగన్ ముస్లింలను కేవలం ఓటుబ్యాంకుగానే చూస్తున్నాడనే విషయాన్ని గ్రహించాలని పేర్కొన్నారు. పట్టణంలోని 18వ వార్డు ఉర్దూ స్కూల్ వద్ద ఆదివారం నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలోనే నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధి జరిగిందన్నది అక్షర సత్యమని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఈ సందర్భంగా షేక్ హాజీబాషా, షేక్ హాజహాన్ తదితరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నగర జయకృష్ణ, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, ఈదర రమణమ్మ, జియావుద్దీన్, ఫాజిల్, రావి జాలయ్య, చంటి, నాగరాజు, షేక్ రఫీ, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



ముస్లింల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఇంటూరి

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

లింగసముద్రం, డిసెంబరు 31 : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నేత ఎం.మాకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో అధికారం, సొమ్ము ప్రజలదని, పాలనా సమాచార హక్కు ప్రజల ప్రాథమిక హక్కు అని తెలిపారు. 2005లో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ చట్టం అమలు జరపడం వలన పరిపాలనలో పారదర్శకత ఏర్పడి అవినీతిని నియంత్రించి ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు : కమిషనర్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

కావలి, డిసెంబరు 31: సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుండడంతో ఆ ప్రభావంతో పట్టణంలో పారిశుధ్యం క్షీణించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పారిశుధ్య పనుల నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం డీఈ సాయిరాం, ఏఈ శ్రీనివాసులు రెడ్డితో కలిసి ఆలయ విలేకరులతో మాట్లాడారు. 90 మంది కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో 40 మంది ప్రైవేట్ కార్మికులతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా పారిశుధ్య సమస్య ఉంటే సమాచారం ఇచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, ఆయిల్ స్ప్రే చేస్తున్నట్లు చెప్పారు. చెత్తతో పేరుకుపోయిన డంపింగ్ యార్డులను కూడా క్లియర్ చేశామని వాటిలో పచ్చదనం పెంచి త్వరలో సుందరంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. అమృత్ ప్రాజెక్ట్ పనులు 90 శాతం పూర్తి అయ్యాయని మిగిలిన 10 శాతం పనులు త్వరలో పూర్తి చేసేలా ఎమ్మెల్యేతో కలిసి చర్యలు చేపడుతున్నామన్నారు. పైపులైన్లకు ఇంటర్ కనెక్షన్‌లు ఇచ్చి త్వరలో పట్టణంలోని అన్ని ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా మంచి నీటి సరఫరా చేస్తామన్నారు. తుపాన్‌కు దెబ్బతిన్న వీధిలైట్లు వెలిగేట్లు చర్యలు చేపడుతున్నామన్నారు. ట్రంకురోడ్డులో సెంటర్ లైటింగ్‌కు ఉన్న వివిధ కంపెనీల కేబుల్ వైర్లను పక్క స్తంభాలకు కట్టుకోవాలని చెప్పి డివైడర్‌లో ఉన్న సెంట్రల్ లైట్ స్తంభాలకు రోప్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాల్టీలో ఓపెన్ జిమ్ పరికరాలు ఉన్నాయని, వాటిని ముసునూరు మందాటి చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్నారు. గడప గడపకు కార్యక్రమం ద్వారా ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.40 లక్షలతో రోడ్లు, డ్రైన్లు నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు.

కళ్లకు గంతలు కట్టుకుని మున్సిపల్ కార్మికుల నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నడుస్తున్నకార్మికులు

కావలిటౌన్, డిసెంబరు 31: మున్సిపల్ కార్మికులు సమ్మెలో భాగంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నల్ల రిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నడుస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కరోనా కష్టకాలంలో ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహించారని, ప్రభుత్వ పెద్దలు కార్మికులకు ఇచ్చిన మాట, ముఖ్యమంత్రి ఎన్నికల హామీలు పూర్తిగా విస్మరించారన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోగా అదనపు పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు తురకా శీనయ్య, బీ రమేష్, ఓ రమేష్, కృష్ణయ్య, అనిత, జ్యోతి పాల్గొన్నారు.

ఎంపీపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

లింగసముద్రం : ప్రజలకు ఎంపీపీ పెన్నా కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నాగారపమ్మకు పూజలు

సంగం, డిసెంబరు 31: మండలంలోని కోలగట్లలో నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

కలువాయిలో హిందూ సమ్మేళనం



అక్షితలు తీసుకుని ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కలువాయి, డిసెంబరు 31 : కలువాయి హిందూ ధర్మ పరిరక్షణ సమితి, సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షితలు, కరపత్రాలతో స్థానిక కలువాయమ్మ ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా సాయిబాబా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారికి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, సమితి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజలకు అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే మేకపాటి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయగిరిలోని తన అతిథిగృహంలో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గం లోని టీడీపీ నాయకులు, తన అభిమానులు, ప్రజలతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటామని ఎమ్మెల్యే మేకపాటి తెలిపారు.

నందిపాడులో వైద్యశిబిరం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 31: మండలంలోని నందిపాడులో ఆదివారం నియోజకవర్గ టీడీపీ నాయకుడు, కాకర్ల ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఆరోగ్య సంజీవని రథం ద్వారా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 175 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మండల శ్రీనివాసులనాయుడు, పోతుగుంట వెంకటేశ్వర్లు, నల్లబోతుల వెంకటేశ్వర్లు, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐవైఎం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, సీఐ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: స్థానిక సీఐ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో 'మరలిరాదు ఈ జీవితం' అనే నినాదంతో రూపొందించిన వాల్ పోస్టర్లను కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు ఆవిష్కరించారు. ఎస్ఐలు ఉమాశంకర్, అనూష, సంస్థ జిల్లా అధ్యక్షుడు ఇందాదుల్లా, ఎస్ఐవో జిల్లా అధ్యక్షుడు అజరుల్లా, సభ్యులు ఇమ్రాన్, తాహిల్, తారీక్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మున్సిపల్, అంగన్‌వాడీల సమ్మె ఉధృతం



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



దున్నపోతుకు వినతిపత్రం అందచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆత్మకూరు, డిసెంబరు 31: ఆత్మకూరు పట్టణంలో సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఆందోళనలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ ఆందోళనకు ఆదివారం నుంచి ఏఐటీయుసీ మద్దతు తెలుపుతూ మిగిలిన మున్సిపల్ కార్మికులు మద్దతు తెలపడంతో సమ్మె ఉధృతమైంది. సమస్యల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దున్నపోతుకు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. అదేవిధంగా సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. అదేవిధంగా ఇప్పటి వరకు సమ్మెలోకి రాని ఏఐటీయుసీ అనుబంధ సంఘాల మున్సిపల్ కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు, ఏఐటీయుసీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అవినీతిని ఎత్తిచూపితే అక్రమ కేసులా? : సోమిరెడ్డి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: ఉదయగిరిలో పేదల ఇళ్లకు ఉపయోగించాల్సిన సిమెంట్‌ను హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి తన సొంత భవన నిర్మాణానికి ఉపయోగిస్తూ అవినీతికి పాల్పడడాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటే వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై దాడిచేసి వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం దారుణమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ వైసీపీ నేతలతో కలిసి టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. అవినీతికి పాల్పడిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి సంబంధంలేని వారితో అట్రాసిటీ కేసు పెట్టించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టీడీపీ నేత, మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నటి వెంకటరెడ్డి, ముజ్జే లక్ష్మీనారాయణ, బాబులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయడంతోపాటు పేదల సిమెంట్ అక్రమంగా వినియోగించుకుంటున్న వ్యక్తిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



బస్టాండ్ సెంటర్‌లో విచారణ చేస్తున్న డీఎస్పీ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును ఆదివారం కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన బస్టాండ్ సెంటర్‌లో ఘర్షణ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అలాగే సెంటర్‌లో దుకాణాల యజమానులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం స్థానిక సర్కిల్ కార్యాలయానికి చేరుకొని ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్ఐలు ఉమాశంకర్, అనూష, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బొల్లినేని



కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొల్లినేని

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: కేంద్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి నారాయణరాణేను ఆదివారం ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లి నేని వెంకట రామారావు తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన మంత్రి దంపతులను బొల్లినేని తన స్వగృహానికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు చొరవ చూపి వలసల నివారణ చర్యలు చేపట్టాలని బొల్లినేని మంత్రిని కోరారు. అలాగే ప్రస్తుత రాజకీయాలపై వారిరువురు గంటపాటు చర్చించుకున్నారు.

పరిహారం కోసం రైతుల ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: సీతారామపురం-దుత్తలూరు మీదుగా ఏర్పాటు చేస్తున్న 167-బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని శకునాలపల్లి పంచాయతీ రైతులు యర్రబల్లిగడ్డ సెంటర్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళ మెడలో సరుడు అపహరణ

వరికుంటపాడు, డిసెంబరు 31: పొలంలో గడ్డి కోస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు సరుడును గుర్తు తెలియని దుండగుడు అపహరించిన సంఘటన ఆదివారం వరికుంటపాడులో చోటుచేసుకుంది. వివరాల మేరకు... ఆండ్రావారిపల్లి గ్రామానికి చెందిన మద్దిరెడ్డి సీతారావమ్మ పశువుల మేత కోసం స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలో పొలానికి వెళ్లింది. దీంతో ఒంటరిగా గడ్డి కోస్తున్న ఆమెను గమనించిన దుండగుడు మెడలోని బంగారు సరుడును లాక్కొని పరారయ్యాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సుమన్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పేదలకు దుస్తుల పంపిణీ

వరికుంటపాడు, డిసెంబరు 31: నూతన సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని స్థానిక ఎస్టీ కాలనీలో ఆదివారం సామ్యూల్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు దుస్తుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తాతపూడి. కళావతి, ఆకాష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పశువులకు టీకాలు

వరికుంటపాడు, డిసెంబరు 31: మండలంలో మంగళవారం నుంచి 30వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పెద్దిరెడ్డిపల్లి పశువైద్యాధికారి ఎస్‌వీ రాఘవేంద్రశర్మ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జనవరి 2వ తేదీన తూర్పు బోయమడగల, వేంపాడు, పెద్దిరెడ్డిపల్లి, 5న గువ్వాడి, 7న భాస్కరాపురం, 8న వరికుంటపాడు, 9న నారసింహాపురం, 10న రామాపురం, 12న ఇస్కపల్లి, తొడుగుపల్లి, 14న అలివేలుమంగాపురం, 15న ఎన్‌బీపల్లి, మహమ్మదాపురం, 16న కాంచెరువు, 18న దామంచర్ల, తోటలచెరువుపల్లి, 20న తూర్పుచెన్నంపల్లి, గణేశ్వరాపురం, 21న గొల్లపల్లి, 22న జడదేవి, 23న పామూరుపల్లి, 24న దక్కనూరు, 25న కనియంపాడు, తూర్పుపాళెం, 26న కొండాయపాళెం, 27న ఇస్కపల్లి, రామదేవులపాడు, 29న జీ.కొండారెడ్డిపల్లి, 30న అలివేలుమంగాపురం గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, డిసెంబరు 31: మండలంలోని గండిపాళెం ఏపీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో పీజీటీ జీవశాస్త్రం, ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు 3వ తేదీ లోపు దరఖాస్తు దాఖలు చేయాలన్నారు. ఈ పోస్టుకు పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ, టెట్ అభ్యర్థులు అర్హులన్నారు.

3 నుంచి ఏఐటీయూసీ కార్మికుల సమ్మె

కావలి, డిసెంబరు 31: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారంలో భాగంగా ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్మికులు కూడా ఈనెల 3వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు ఎండ్లూరి రవి, కొప్పర్తి నాగరాజు, ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేశ్, బండారు రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిసెంబరు 7న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సమ్మె చేపడుతామని ప్రభుత్వానికి నోటీస్ ఇవ్వగా 10 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి నేటికీ పరిష్కరించకపోవడంతో సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు.

యూరియా కొరత సృష్టిస్తే డీలర్లపై చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అల్లూరు, డిసెంబరు 31 : ప్రైవేటు డీలర్లు యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని అల్లూరు వ్యవసాయాధికారి లలిత హెచ్చరించారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అల్లూరులో యూరియా కొరత' కథనంపై ఆమె స్పందించారు. ఆమె మాట్లాడుతూ ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా కొనాల్సిన అవసరం లేదని, ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆర్బీకేల ద్వారా ఎరువులను పొందేందుకు అవకాశం ఉందన్నారు. సొసైటీల్లో యూరియా నిల్వలు ఉంచేందుకు అభ్యర్థనలు పంపి ఉన్నామన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

కావలిటౌన్, డిసెంబరు 31: కావలి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముసునూరు మర్రిచెట్టు గిరిజన కాలనీ, రాఘవేంద్ర కాలనీ, సాయిబాబా నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు పేరం వెంకటేశ్వర్లు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, గంధం ప్రసన్న, రాజకుమార్, స్థానిక నేతలు పూనూరు శివకుమార్ రెడ్డి, అందె కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



రామాంజనేయులు

కందుకూరు : స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న డీ.రామాంజనేయులుకు అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. ది. క్విట్ ఇండియా ఉద్యమం యొక్క చారిత్రక అధ్యయనం - నూతన దృక్పథంతో పరిశీలన అనే అంశంపై ప్రొఫెసర్ కె.మల్లికార్జునరెడ్డి పర్యవేక్షణలో రామాంజనేయులు పరిశోధనాపత్రాలు సమర్పించడంతో డాక్టరేట్ లభించిందని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవి కుమార్ తెలిపారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడు రామాంజనేయులును ప్రిన్సిపాల్ రవికుమార్, సహచర అధ్యాపకులు అభినందించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కావలి రూరల్ : కావలి మండలం రాజువారి చింతలపాలెం సమీపంలోని పొలాల్లో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై ఆదివారం రూరల్ ఎస్ఐ సుమన్ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,29,400 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

సంగం : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతిచెందిన సంఘటన మండలంలోని జంగాలదొరువులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కలిగిరి మండలం చిన్న అన్నలూరుకు చెందిన సీహెచ్ పద్మావతి (25)కి ఐదేళ్ల కిందట జంగాలదొరువు గ్రామానికి చెందిన వెంకటరత్నంతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి భర్త వెంకటరత్నం నిద్రలేచి చూసేటప్పటికి మంచంపై అపస్మారక స్థితిలో పద్మావతి పడిఉండడంతో ఉదయం వెంకటరత్నం పద్మావతి తల్లికి ఫోన్‌చేసి సమాచారం అందించాడు. దీంతో ఆమె సంఘటన స్థలానికి వచ్చి అల్లుడిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

మహోన్నత లక్ష్యంతో ముందడుగు

- మానవత్వం చాటుతున్న ఎన్ఆర్ఐ
- ఉదయగిరిలో విస్తృత సేవలు
- విద్యా, వైద్యం, ఉపాధికి అధిక ప్రాధాన్యత
- అన్నా క్యాంటీన్ ద్వారా రుచికరమైన భోజనం
- అభాగ్యులకి ఆర్థికంగా అండదండలు

ఉదయగిరి నియోజకవర్గ మెట్టప్రాంతంలో సమయానికి వర్షాలు కురవక నష్టాలు చవిచూసే రైతులు... కనీసం కూలిపనులు లేక ఊళ్లకి ఊళ్లే వలసలు వెళ్లే పరిస్థితులు... సమయానికి వైద్యం అందక మృత్యువాతపడే అభాగ్యులు... ఉపాధిలేక అల్లాడే యువతీ యువకులు... చిన్నపాటి వ్యాపారాలకీ ఆర్థిక ఇబ్బందులుపడే చిరు వ్యాపారులు... ఇలా కన్నీరెట్టించే బాధలు ఎన్ఆర్ఐ కాకార్ల సురేశ్‌ని కలిచి వేశాయి. సొంత ప్రాంతానికి ఏదో చేయాలనే తపనతో విదేశాలని వదిలి ఉదయగిరిలో అడుగుపెట్టేలా చేశాయి. తన వంతుగా తమ ప్రాం త ప్రజలకి మరిచిపోలేని మేలు చేయాలని, అందర్నీ ఉన్నతమార్గంలో నడిపించాలనే మహోన్నత లక్ష్యంతో ముందుడుగు వేశారు. కాకార్ల చారిటబుల్ ట్రస్టుని స్థాపించి విద్యా, వైద్యం, ఉపాధితో పాటు పలు విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వం చాటుకుంటు న్నారాయన. పూర్తి వివరాలపై ఆంధ్రజ్యోతి కథనమిది.



ఉదయగిరి నియోజకవర్గ మెట్టప్రాంతంలో సమయానికి వర్షాలు కురవక నష్టాలు చవిచూసే రైతులు... కనీసం కూలిపనులు లేక ఊళ్లకి ఊళ్లే వలసలు వెళ్లే పరిస్థితులు... సమయానికి వైద్యం అందక మృత్యువాతపడే అభాగ్యులు... ఉపాధిలేక అల్లాడే యువతీయువకులు... చిన్నపాటి వ్యాపారాలకీ ఆర్థిక ఇబ్బందులుపడే చిరు వ్యాపారులు... ఇలా కన్నీరెట్టించే బాధలు ఎన్ఆర్ఐ కాకార్ల సురేశ్‌ని కలిచివేశాయి. సొంత ప్రాంతానికి ఏదో చేయాలనే తపనతో విదేశాలని వదిలి ఉదయగిరిలో అడుగుపెట్టేలా చేశాయి. తన వంతుగా తమ ప్రాంత ప్రజలకి మరిచిపోలేని మేలు చేయాలని, అందర్నీ ఉన్నతమార్గంలో నడిపించాలనే మహోన్నత లక్ష్యంతో ముందుడుగు వేశారు. కాకార్ల చారిటబుల్ ట్రస్టుని స్థాపించి విద్యా, వైద్యం, ఉపాధితో పాటు పలు విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మానవత్వం చాటుకుంటున్నారాయన. పూర్తి వివరాలపై ఆంధ్రజ్యోతి కథనమిది.

సామాన్య కుటుంబం

ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం ఎర్రంరెడ్డిపల్లిలో కాకర్ల సురేశ్ జన్మించారు. కాకర్ల వెంకటసుబ్బానాయుడు, ప్రమీల తల్లిదండ్రులు. తండ్రి వెంకట సుబ్బానాయుడు రెవెన్యూశాఖలో వీడీఓగా పనిచేసేవారు. ఉదయగిరితో పాటు పలుప్రాంతాల్లో ఆయన సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. చిన్నప్పటి నుంచి సురేశ్, సోదరుడు సునిల్ కష్టపడి చదువుకునేవారు. సురేశ్ చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్నారు. హైస్కూల్ లో చదివే రోజుల్లోనే విద్యార్థి సంఘంలో చురుగ్గా ఉండేవారు. విద్యార్థుల సమస్యలపై జరిగే పోరాటాల్లో కీలకభూమిక పోషించేవారు. సురేశ్ ఇంజనీరింగ్, సునీల్ పశువైద్యంలో ఉన్నత చదువులు అభ్యసించారు. చదువుల్లో ఉన్నతంగా రాణిస్తూ తల్లిదండ్రులకి పేరు తెచ్చారు.



సేవలోనే ఆనందం

అన్నదమ్ములు ఇద్దరూ 2000 సంవత్సరంలో అమెరికాకి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అమెరికా దేశానికి వెళ్లి జీవితం హాయిగా గడిచిపోతున్నా, సురేశ్‌లో ఏదో వెలితి అనిపించేది. కేవలం మనం, మన కుటుంబమే కాదు... మన తెలుగువారికి, తోటివారికి సాయం చేయాలని తపనపడేవారు. అలా నార్త్ కెరిలినా తెలుగు అసోసియేషన్‌కి పదేహేనేళ్లపాటు అధ్యక్షుడిగా పనిచేశారు. తానా రీజనల్ ఉపాధ్యక్షుడిగానూ పనిచేసి ప్రముఖుల ప్రశంశలు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికా వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడే విద్యార్థులు, అకస్మాత్తుగా అనారోగ్యా నికి గురై, భీమాలు వంటివి లేక ఇబ్బందులు పడేవారికి సంస్థల ద్వారా వెన్నుదన్నుగా నిలిచేవారు. అకస్మాత్తుగా కొందరు అమెరికాలో మృతిచెందగా, ఇండియాలో వారి కుటుంబాలు కడచూపు కోసం వేడుకుంటూ ఉండేవారు. అలాంటి సందర్భాల్లో, వారి పార్థీవదేహాలని స్వస్థలాలకి పంపించేందుకు రోజులు తరపడి పనిచేసేవారు. ఇలా సురేశ్ ఎన్నెన్నో సేవలు చేస్తుండేవారు. అలా అమెరికాలో ఉన్నన్ని రోజులు తోటి వారికి సేవచేస్తూ ఆనందించేవారు.

కోవిడ్ సమయంలో...

ప్రపంచాన్ని కోవిడ్ మహమ్మారి గజగజ వణికిస్తూ అందరూ ఇళ్లకే పరిమితమైనప్పుడు సురేశ్ నిరుపమైన సేవలకి శ్రీకారం చుట్టారు. తానా సంస్థలోని టీం స్క్వేర్ టీంకి కో-చైర్మన్‌గా మిగిలిన సభ్యులతో కలిసి సంపూర్ణ బాధ్యతలు నిర్వర్తించారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో రూ.4కోట్లతో ఆక్సిజన్ వెంటిలేటర్లు ఏర్పాటు చేయించారు. తద్వారా తానా టీమ్ స్క్వేర్ ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడగలిగారు. అలాగే 15వేల మెడికల్ కిట్లు అందించారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచమం తటా జడలు విప్పి కరతాళనృత్యం చేస్తున్న సమయంలో సురేశ్ తనవంతుగా తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం క్రియాశీలక పాత్ర పోషించారు. ఏపీ గవర్నర్ చేతుల మీదుగా తానా టీం స్క్వేర్ తరుపున అవార్డుని అందుకున్నారు.



కరిగించిన కన్నీటి కష్టాలు..

ఉదయగిరి నియోజకవర్గ ప్రజల కన్నీటి కష్టాలని చూసి కాకర్ల సురేశ్ చలించిపోయారు. తాను ఏదోలా తనవాళ్లకి సాయపడాలని నిర్ణయించుకున్నారు. ఆరు నెలల పాటు ప్రజల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు, అవసరాలు, సమస్యల పై సర్వే చేయించారు. నియోజకవర్గంలోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లోని మారుమూల కుగ్రామాల్లో పరిస్థితులనీ అంచనా వేశారు. 2021 అక్టోబర్ లో కాకర్ల చారిటబుల్ ట్రస్టుని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ట్రస్టు తరుపున రూ.కోట్లుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విస్తృత సేవా కార్యక్రమాలివే





• వింజమూరులో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసి 250 రోజులకి పైగా ప్రతిరోజూ సరాసరిన 600 మందికి రూ.5లుకే రుచికరమైన భోజనం అందిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ఎంతో మంది ఆకలితో ఇబ్బంది పడే పేద, నిరుపేదల ఆకలి తీరుస్తున్నారు. వింజమూరుకి పలు పనుల మీద వచ్చే రైతులు, చిరుద్యోగులు వంటివి వారూ భోజనం చేసి తృప్తిగా వెళుతున్నారు. • ప్రకాశం జిల్లా మార్కాపురంలో సంజీవనీ ఆరోగ్య రథాన్ని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రారంభించారు. అప్పటి నుంచి ఉదయగిరి నియోజవర్గంలోని గ్రామగ్రామానికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఉచితంగా అత్యాధునిక పరీక్షలు నిర్వహించి, మేలురకం మందులు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 26000 మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. • గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి పరీక్షలు నిర్వహించారు. 50 మందికి పైగా ఉచిత కంటి ఆపరేషన్లు చేయించారు. 1150 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. • వింజమూరులో ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 400 మందికి ఆయా రంగాల్లో నిపుణులతో శిక్షణ ఇప్పించి సర్టిఫికేట్లు అందజేశారు. పరిశ్రమలు, సంస్థలతో సంప్రదించి వందలాది మందికి ఉపాధి కల్పించారు. మరికొందరు వారి గ్రామాల్లోనే ఇంటి వద్ద స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ సామాగ్రి కోసం ఆర్థిక సహాయం అందించారు. • డ్రైవింగ్ శిక్షణ సంస్థ ద్వార యువకులకి డ్రైవింగ్ లో శిక్షణ ఇప్పించడంతో పాటు లైసెన్సులూ ఇప్పించారు. 30 మందికి పైగా డ్రైవింగ్ ద్వారా ఉపాధిపొందే వీలు కల్పించారు. • గ్రామాల్లో సమస్యలన్నీ గుర్తించి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో రూ.50వేలు నుంచి రూజ2లక్షలు ఖర్చు పెడుతూ 20కి పైగా పంచాయతీల్లో రోడ్ల మరమ్మతులు, బోర్లు నిర్మాణం వంటివి చేపట్టారు. • వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో రైతులకి పవర్ స్ప్రేయర్లు దొరక్క ఇబ్బంది పడుతుంటారు. దాంతో 160కి పైగా పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో రైతులు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. వాటికి అవసరమైన మరమ్మతులూ చేయిస్తున్నారు. • 80 మందికి పైగా చిరువ్యాపారులకి తోపుడు బండ్లు ఇప్పించి, వారి ఇళ్ల వద్దకే చేర్చారు. అగ్ని ప్రమాదాలు, విపత్తుల వల్ల పూర్తిగా నష్టపోయిన 35 కుటుంబాలని ఆర్థికంగా ఆదుకున్నారు. 35 కుటుంబాలకి రూ.50వేలు నంచి రూ.2లక్షల వరకు ఆర్థికంగా సహాయం చేశారు. అనారోగ్యం వల్ల ఆర్థికంగా చితికిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న 2200 మందికి, వారి పరిస్థితులని బట్టి రూ.5వేలు నుంచి రూ.2లక్షల వరకు సాయం అందించారు. • పేదల ఇళ్లలో జరిగే వివాహాలకి హాజరై 550 కుటుంబాలకి ఒకొక్కరికి రూ.10వేలు చొప్పున పెళ్లి కానుకగా అందజేశారు. • 30కి పైగా ప్రాంతాల్లో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్లు నిర్వహించి క్రీడాకారులని పోత్సహిస్తున్నారు.

చంద్రబాబుకి వీరాభిమాని :

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడికి సురేశ్ వీరాభిమాని. చిన్నప్పటి నుంచి ఆయన్నే ఆదర్శంగా తీసుకుని ముందుకు నడిచామని చెబుతారు. కష్టపడి చదువుకోవడం, ఉన్నత శిఖరాలు అధిరో హించడం ఒక ఎత్తు అయితే.. సేవా కార్యక్ర మాలు చేపట్టి సమాజానికి మనవంతు సేవ చేయడం మరో ఎత్తని, అందులోనే తనకి అమిత ఆనందం లభించిందని అంటారు. యువనేత లోకేశ్ సిద్ధాంతాలు, వ్యక్తిత్వం తనపై ఎంతో ప్రభావం చూపాయని చెబుతారు. ఎవరికైనా సాయం చేసినప్పుడు నూరేళ్లు చల్లంగా ఉండయ్యా.. అంటూ దీవించే దీవనలు ఇచ్చే ఆత్మసంతృప్తి మరువలేనిదని అంటుంటారు. జీవితాంతం తన వంతు ప్రజలకి సేవ చేస్తూనే ఉంటానని చెబుతున్నారు.











చిల్డ్రన్స్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 31 : నగరంలోని వైఎంసీఏ మైదానంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. దీనిని స్థానిక కార్పొరేటర్ దాసరి అమృత దంపతులు ప్రారంభించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఎస్‌కే బాబు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో కుటుంబం మొత్తం ఆనందించే విధంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డెవిల్ హౌస్‌ను ఉచితంగా దర్శించవచ్చని తెలిపారు. చిన్నారుల కోసం జెయింట్ వీల్, వాటర్‌బోట్, డ్రాగన్ ట్రెయిన్, బ్రేక్ డాన్స్ వంటి రకరకాల రైడర్స్ ఉన్నాయని చెప్పారు. చేనేత, హస్తకళా వస్తువులు, ఆర్టిఫీషియల్ జ్యూయలరీ, గృహోపకరణాలు ఉత్పత్తి ధరలకే లభిస్తాయన్నారు. ఫుడ్ కోర్టుల్లో రకరకాల వంటకాలు ఉంటాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ సాయంత్రం 4 నుంచి రాత్రి 10గంటల వరకు తెరచి ఉంటుందని తెలిపారు.



టీడీపీలో చేరిక

నెల్లూరు రూరల్, డిసెంబరు 31 : రానున్న కాలంలో యువతకు మంచి భవిష్యత్ టీడీపీ మాత్రమే ఇవ్వగలదని ఆ పార్టీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో 20వ డివిజన్‌కు చెందిన పోలిపోగు నారాయణ మిత్రబృందాన్ని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చేజర్ల మహేష్, నాయకులు జలదంకి సుధాకర్, సాయిబాబా, దారా మల్లి, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా, ఏసీసుబ్బారెడ్డి స్టేడియంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఒక్కడినే ఒంటరిగా కార్యక్రమం నిర్వహించారు.

కోటంరెడ్డి కుటుంబీకుల ప్రచారం

నెల్లూరు రూరల్లోని గుడిపల్లిపాడు పరిధి జాకీర్‌హుస్సేన్ నగర్‌లో ఆదివారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత, కుమార్తె లక్ష్మీహైందవి, సాయి వైష్ణవి ఇంటింటా ప్రచారం చేశారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను అందచేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. సిరిగార్డెన్స్‌లోనూ ప్రచారం చేపట్టారు.

వాకర్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నెల్లూరు (విద్య): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఎంవీ సుబ్బారెడ్డి, వెంకటాద్రిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నలుబోలు బలరామయ్య నాయుడు, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ రామ్మోహన్ రెడ్డి, కార్యదర్శి షేక్ నసీర్ అహ్మద్, కోశాధికారి ఎస్ సుబ్బారాయుడు, గౌరవాధ్యక్షుడు వినుకొండ వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.



























నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

ఆంధ్రాలో బ్రిటీష్ పాలన

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 31 : ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వ పాలన బ్రిటీష్ పాలనను తలపిస్తోందని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ విమర్శించారు. ఆదివారం నగరంలోని 6వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నారాయణ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో చిరువ్యాపారుల, ఇతర వర్గాల కళ్లల్లో నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు చట్టప్రకారం నడుచుకోవాలని కోరారు.



స్థానికులతో మాట్లాడుతున్న నారాయణ, పక్కన కోటంరెడ్డి

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు దమ్ముంటే నెల్లూరు నుంచే పోటీ చేయాలని సవాలు విసిరారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, పూర్ణ, సాయి, నరహరి, రామకృష్ణ, రవి, రాజేశ్వరి, బ్రహ్మంగుప్తా, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కవిత, విజయదుర్గా పాల్గొన్నారు. కాగా, నగరంలోని 4వ డివిజన్ లోనూ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవితో కలిసి బాబుష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'సెయింట్ పీటర్స్'కు రూ.50వేల విరాళం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 31 : నగరంలోని రంగనాయకులపేటలో గల సెయింట్ పీటర్స్ హైస్కూల్‌కు ఆదివారం మదర్ థెరిస్సా చారిటీస్ సంస్థ రూ.50వేల విరాళం అందజేసింది. ఈ సందర్భంగా బోర్డింగ్ స్కూలు విద్యార్థులకు కూల్ డ్రింక్స్ కేకులు, అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చారిటీస్ సంస్థ సభ్యులు దారా జయరాజ్ (ఎర్రబాబు), ఫాదర్ బీ వరప్రసాద్, వాకర్స్ మిత్రులు పాల్గొన్నారు.



విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు

నేటి నుంచి ఆన్‌లైన్‌లో జీవన ప్రమాణ్ సర్టిఫికెట్ల సమర్పణ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 31 : ప్రభుత్వ సర్వీసు పెన్షనర్స్ ఫ్యామిలీ పెన్షనర్స్ సోమవారం (జనవరి 1) నుంచి జనవరి 29లోగా జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో పంపాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీవీఎస్ మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ సౌకర్యార్థం నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని పెన్షన్ సంక్షేమ భవనంలో లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో సమర్పణకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. పెన్షనర్లు అందరూ జనవరి 2వతేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 10గంటలకు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

100 మంది విద్యార్థులకు పారితోషికాలు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 31 : పేద బ్రాహ్మణ హయ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు రూ. 3.90లక్షల పారితోషికాలను ఆదివారం ఆ ట్రస్ట్ అందజేసింది. విజయ మహల్ గేట్ సమీపంలో గల ఆంధ్ర సభ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ జేవీఎస్ ధీరజ్, సబ్‌రిజిస్ట్రార్ భానుమతి పారితోషికాలు పంపిణీ చేశారు ట్రస్టు సేవలను అభినంది స్తూ పుష్ప కాల శశిధర్ రూ.25వేల విరాళం అందజేశారు. ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ వై నాగదేవి ప్రసాద్, అధ్యక్షుడు వర ప్రసాద్, కోశాధికారి సతీష్ పర్యవేక్షించారు.

బీటీఏ డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (విద్య), డిసెంబరు 31 : బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) 2024 సంవత్సర డైరీని జడ్పీ సీఈవో బీ చిరంజీవి ఆదివారం జడ్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, కోశాధికారి ఆదినారాయణ, జిల్లా అధ్యక్షకార్యదర్శులు మునిసుబ్బు, మాస ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ర్యాలీ

నెల్లూరు రూరల్ : కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ కూడలి వరకు జరిగిన ఈ ర్యాలీలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నినాదాలు చేశారు. అభివృద్ధిని విస్మరించిన జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం కూడా పక్కన పెట్టేశాడని దుయ్యబట్టారు. తమపై ఎన్ని ఆంక్షలు విధించినా వాటన్నిటినీ అధిగమించి డిమాండ్లను సాధించుకుని తీరుతామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నేత మస్తాన్‌బీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ క్యాలెండరు ఆవిష్కరణ

నెల్లూరు రూరల్, డిసెంబరు 31 : మండలంలోని కొండ్లపూడి గ్రామంలో ఆదివారం గంగమ్మ ఆలయంలో దేవస్థానానికి చెందిన క్యాలెండర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులైన పచ్చిపాల శ్రీనివాసులు, దొడ్ల సుబ్రమణ్యం మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో గంగమ్మ ఆలయాన్ని 75 శాతం పూర్తి చేశామని, మిగిలిన నిర్మాణం ఉగాది నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు దొడ్ల సురేష్, అంబటి మురళి, వెంకట రమణయ్య, హరినాథ్, నాగార్జున పాల్గొన్నారు.



జనసేనలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు : మనుక్రాంత్


నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట), డిసెంబరు 31: జనసేన పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో నగర అధ్యక్షుడు సుజయ్ బాబుతో కలిసి ఆదివారం పలువురికి నియామక పత్రాలు అందజేశారు. 15 మంది ని నగర కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులుగా నియమించినట్లు చెప్పారు. 20వ డివిజన్ ఇన్‌చార్జిగా భార్గవ్, నగర కార్యదర్శులుగా ప్రతాప్, సునీత, మహేష్, వినయ్, కార్తిక్, సంయుక్త కార్యదర్శులుగా మణికంఠ, సదాశివం, అమీర్‌జాన్, వంశీ తదితరులను నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందిస్తున్న మనుక్రాంత్‌రెడ్డి

మదరసాకు జానీ మాస్టర్ రూ.50వేల విరాళం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 31: నెల్లూరు రూరల్‌లో ని మదరసా ఈ మన్వర్ సంస్థకు ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ జానీ రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం ఆ మదరసాలో జానీ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మదరసాల నిర్వహణకు ఆర్థిక సాయాన్ని నిలిపివేశారని, మదరసాలంటే నే జగన్ రెడ్డికి పడదా అని ప్రశ్నించారు. మదరసాలను నిర్వీర్యం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్య దర్శి గునుకుల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయండి

మనుబోలు, డిసెంబరు 31: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సర్వేపల్లి ఈఆర్‌వో చిన ఓబులేసు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని వడ్లపూడి,గొట్లపాళెం, వీరంపల్లి, మనుబోలు పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్‌రోజుకి కేంద్రాల్లో తాగునీరు, కరెంటు, ఫర్నిచర్, రోప్‌వే, వీల్‌చైర్, మరుగుదొడ్ల వసతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బీ శివకృష్ణయ్య, బీఆర్‌వోలు నాగార్జునరెడ్డి, మురళీధర్, బీఎల్‌వోలు స్వాతి, మాధవి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఆర్‌వో చిన ఓబులేసు

పొదలకూరు : పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఈఆర్‌వో చిన్న ఓబులేసు ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను ఆయన పరిశీలించారు. సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు.

20 అవార్డులు సాధించిన డెంటిస్టు కావ్య

మనుబోలు, డిసెంబరు 31: మనుబోలుకి చెందిన దంత వైద్యురాలు డాక్టర్ కావ్య నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ వేడుకలో 20 అవార్డులు అందుకున్నారు. ఆమె 2018లో బీడీఎస్‌లో చేరారు. 3వ ఏడాది పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ విభాగంలో స్టేట్‌ఫస్ట్ అవార్డు, నాలుగవ ఏడాదిలో స్టేట్‌లో 9వ స్థానంలో అవార్డు, జిల్లా స్థాయిలో నాలుగు విభాగాల్లో 16 అవార్డులతోపాటు, వ్యక్తిగత ప్రవర్తనలో బెస్ట్ అవుట్ గోయింగ్ అవార్డును, వైద్యురాలిగా పట్టాను డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ అజయ్‌వెజనాల్, డీన్ శివకుమార్, హెచ్‌వోడీ లావణ్య అనుమోలా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనువాసులు తదితరుల నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.



అవార్డులతో కావ్య

తుఫాను పరిహారం పంపిణీలో అవినీతి

వెంకటాచలం, డిసెంబరు 31 : తుఫాన్ నష్టపరిహారం పంపిణీలో వైసీపీ నాయకులు భారీగా అవినీతికి పాల్పడ్డారని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆరోపించారు. మండలంలోని మల్లుగుంట సంఘంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ పరిహారం పంపిణీ కేవలం వైసీపీ నాయకులు, వారి అనుచరులకేనా ? అని ప్రశ్నించారు. తుఫాన్ బాధితులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మినేని వాణిభవాని, పినిశెట్టి మల్లికార్జున్, శ్రీహరి, రహీమ్, సుధాకర్, సుబ్రహ్మణ్యం, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి !

వెంకటాచలం, డిసెంబరు 31: జగన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ నేతలు ఘాటుగా విమర్శించారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం వారు నవరత్నాలు, నవ మోసాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నాయకులు బొమ్మి సురేంద్ర, రావూరి రాధాకృష్ణమనాయుడు, గుమ్మడి రాజాయాదవ్, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా జగన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 15శాతం కూడా అమలు చేయలేదన్నారు. నవరత్నాలు నవ మోసాలుగా మారాయని వారు ధ్వజమెత్తారు.కార్యక్రమంలో నీలం మల్లికార్జునయాదవ్, ఈపూరు మునిరెడ్డి, యదనపర్తి శ్యామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నవమోసాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

ఇందుకూరుపేట : నవరత్నాలు నవమోసాలు అయ్యాయని కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని జగదేవిపేటలో ఆదివారం ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రావెళ్ల వీరేంద్రచౌదరి, చెంచుకిషోర్ యాదవ్, కూకటి వెంకటేశ్వరరెడ్డి, బొల్లినేని హరినాయుడు, బొల్లినేని రవినాయుడు, బోయిపాటి శ్రీనివాసులునాయుడు, సింధూర కృష్ణ ఈదూరు చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో ఆంగ్ల సంవత్సర వేడుకలు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ప్రారంభం అయ్యాయి. యువకులు, చిన్నారులు 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2024కి స్వాగతం పలికారు. కేక్‌లు కట్ చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సెల్‌ఫోన్లలో హ్యాపీ న్యూయర్ సందేశాలు పంపుకున్నారు. బుచ్చిలోని జాతీయ రహదారి వెంబడి వివిధ ఆఫర్లతో కేకులు, బొకేల అంగళ్లు వెలశాయి. మందు బాబుల కోసం హోటళ్ల నిర్వాహకులు పలు మాంసాహార పదార్థాలను సిద్ధం చేశారు. అలాగే పలు చోట్ల మద్యం బెల్టు దుకాణాలు వెలిశాయి. అధిక ధరలకు మద్యం విక్రయించారు.



కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కోవూరు సీఐ బాధ్యతల స్వీకరణ

కోవూరు, డిసెంబరు 31: కోవూరు సీఐగా టీవీ శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు పోలీసు అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

టీడీపీ నేతకి అభినందన

కోవూరు,డిసెంబరు31: టీడీపీ కార్యక్రమాల యాప్‌ను 30,000 పాయింట్స్‌ను పూర్తి చేసిన పోతిరెడ్డిపాళెం గ్రామ టీడీపీ నాయకుడు షేక్ సుభాన్‌ను ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అభినందించారు. పార్టీ పతాకాన్ని బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమూరు అశోక్‌రెడ్డి, నాటకరాని వెంకట్ పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు హర్షణీయం

కోవూరు,డిసెంబరు31: సీఎం జగన్మోహనరెడ్డి రూ. 3,000లకు పింఛన్ పెంచడం హర్షణీయమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక రైల్వేఫీడర్స్ రోడ్డులోని పీఆర్‌ఆర్ గెస్టుహౌస్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో వైసీపీ నాయకులు,ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డీఏపీటీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన బాబురెడ్డి, ఎంపీపీ పార్వతి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండరు ఆవిష్కరణ

తోటపల్లిగూడూరు, డిసెంబరు 31: మండలంలోని నరుకూరులో ఆదివారం వన్య కుల క్షత్రియ, అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాకం వెంకయ్య ఆధ్వర్యంలో 2024 క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సంఘం నాయకులు వేగూరు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ఎన్. రాజేంద్రప్రసాద్, దీక్షిత్‌బాబు, వాకాటి మహేష్, ఎన్.శ్రీనివాసులు, ఎన్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

3న పంచాయతీరాజ్ సదస్సు

తోటపల్లిగూడూరు, డిసెంబరు 31: జనవరి 3న విజయవాడలో రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ పంచాయతీ చాంబర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జి గోపిరెడ్డి వెంకటేష్ యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ పంచాయతీ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో మాజీ సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరు కావాలని కోరారు.

చిత్రకళా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పొదలకూరు, డిసెంబరు 31 : నెల్లూరులోని అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ చిత్రకళా పోటీల్లో అమరావతి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచి ఆదివారం అవార్డులు అందుకున్నారు. తమ పాఠశాల విద్యార్థులు అవార్డులకు ఎంపికకావడం పట్ల కరస్పాండెంట్ సురేష్ హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల నుంచి సుమారు 20 మంది గోల్డ్ మెడల్ అవార్డులను నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారని ఆయన తెలిపారు.

మైపాడులో ఉచిత వైద్య శిబిరం

ఇందుకూరుపేట, డిసెంబరు 31: మండలంలోని మైపాడులో యువనాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రెయిన్‌బో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ పీ సునీల్‌కుమార్, హాస్పిటల్ మేనేజర్లు పీ బాలాజీ, కే ప్రవీణ్, సర్పంచి సంగం వెంకయ్య, ఎంపీటీసీ గంపల సుబ్రహ్మణ్యం, శివాలయం చైర్మన్ కనుపూరు సురేంద్ర, మాజీ ఎంపీటీసీ శ్రీహరికోట ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కామాక్షితాయికి వెండి నందిసేవ

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు31: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా జొన్నవాడ కామాక్షితాయికి ఆదివారం రాత్రి పెద వెండి నందిసేవ గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ముందుగా స్వామి,అమ్మవార్లకు ప్రత్యేకంగా కళ్యాణం జరగనుంది. భక్తులకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, ఈవో గిరికృష్ణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హారికకు బంగారు పతకం

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు31: స్థానిక బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఏ. హారికకు జాతీయ చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకం లభించింది. ఈనెల 19న పాఠశాలలో అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా హారిక ప్రతిభ చాటి బంగారు పతకం సాధించింది. ఆమెను ఉత్తమ ఉపాధ్యాయుడు, డాక్టర్ చీదరాల చెన్నయ్య, మురళీమోహన్‌రాజుతోపాటు పలువురు అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ ఫలాలు పేదల దరిచేర్చండి

దక్కిలి, డిసెంబరు 31: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పేదల దరిచేర్చడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు అన్నారు. దక్కిలి మండలం డి.వడ్డిపల్లిలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వేపమాను చెంచమ్మ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గం: పాశం


పాశం సునీల్‌కుమార్‌కు నోటీసు అందజేస్తున్న పోలీసులు

గూడూరు, డిసెంబరు 31: తనపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వెనక్కి తగ్గకుండా వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళతానని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం నెల్లూరులోని తన నివాసంలో గూడూరు పోలీసులు 41 నోటీసులను అందించడంపై ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తనపై ప్రభుత్వం అక్రమంగా 14 కేసులు పెట్టిందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూ ప్రజల్లోకి వెళుతున్న తనపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వెనకాడే ప్రసక్తే లేదన్నారు. పేదల పక్షాన నిలిచే టీడీపీతోనే ఉంటూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేసేందుకు సాయశక్తులా కృషి చేస్తానని సునీల్‌కుమార్ అన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన సీఎం జగన్


సమావేశంలో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

గూడూరు, డిసెంబరు 31: నిరుద్యోగులను సీఎం మోసం చేశారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బీజేవైఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలన్నారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు అండగా ఉంటామని సీఎం జగన్ హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన మాటలను గాలికి వదిలేశారన్నారు. రానున్న ఎన్నికల్లో యువత వైసీపీ బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో శివశంకర్, చైతన్య, ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రామరాజ్యం


మేనిఫెస్టో గురించి మహిళలకు వివరిస్తున్న డాక్టర్ మస్తాన్

వెంకటగిరి, డిసెంబరు 31: టీడీపీతోనే రామరాజ్య స్థాపన సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకుడు డాక్టర్ మస్తాన్ యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని 14వ వార్డులో పట్టణ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనకు అంతమొందించే సమయం దగ్గరలో ఉందని, అందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అమృత్‌భారత్ రైలుకు స్వాగతం పలకండి

గూడూరు, డిసెంబరు 31: స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం మధ్యాహ్నం 12:30 గంటలకు అమృత్‌భారత్ రైలు ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మాల్దా నుంచి బెంగళూరుకు అమృత్‌భారత్ రైలును నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలు సోమవారం మధ్యాహ్నం 12:30 గంటలకు గూడూరుకు చేరుకుంటుందని, ఈ సందర్భంగా నిర్వహించే స్వాగత కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కుమార్, ప్రసాద్, శ్యామ్, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

సూళ్లూరుపేట, డిసెంబరు 31: సూళ్లూరుపేటలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద యాదవ సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘ గౌరవ అధ్యక్షుడు జెట్టి వేణుయాదవ్, అధ్యక్షుడు మెళ్లకంటి శ్రీనివాసులు, ముచ్చకాల హర్షవర్ధన్, చిలకా యుగంధర్, రామాంజనేయులు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

తొలగిన చెత్తకుప్పలు

సూళ్లూరుపేట, డిసెంబరు 31: సూళ్లూరుపేట మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండడంతో పట్టణంలోని ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయాయి. మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కమిషనర్ నరేంద్రకుమార్ కార్మికులతో చర్చలు జరిపిన విఫలమయ్యాయి. శనివారం అర్ధరాత్రి కూలీలను పెట్టి పట్టణంలో చెత్తను తొలగించేందుకు మున్సిపాలిటీ అధికారులు ప్రయత్నించారు. కార్మికులు, సీఐటీయూ నేతలు అడ్డుకోవడంతో వెళ్లిపోయారు. ఆదివారం మున్సిపల్ చైర్పన్, వైసీపీ నాయకుడు శేఖర్‌రెడ్డి కూలీలను పెట్టి చెత్త కుప్పలను తొలగింపజేశారు.

2024 పాఠకులకు, ప్రకటన కర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 1 జనవరి 2024



శ్రీకాళహస్తిలో నోరూరిస్తున్న వెరైటీ కేక్



తిరుపతి శిల్పారామంలో ఫ్యాషన్‌షో



తిరుమల ఆలయంలో పుష్పాలంకరణలు

సంవత్సరాది సందడి



పుష్పాలంకార శోభితం..శ్రీహరి ఆలయం

తిరుమల, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా శ్రీవారి ఆలయం పుష్పాలంకార శోభితమైంది.ఐదు టన్నుల సంప్రదాయ పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్‌తో ఆలయంలో వైకుంఠద్వారాన్ని, బంగారు వాకిలిని, బలిపీఠాన్ని, ధ్వజస్తంభాన్ని సౌందర్యవంతంగా అలంకరించారు. నెదర్లాండ్,తైవాన్,బ్యాంకాక్ దేశాలనుంచి తెప్పించిన తులిప్స్ కట్‌ఫ్లవర్స్‌ను, జెయింట్ అర్కిట్స్, ప్రోటివర్ లాంటి అరుదైన పుష్పాలను అలంకరణలో వినియోగించారు.బెంగళూరుకు చెందిన సునీత పుష్పాలంకరణకు అవసరమైన విరాళం అందజేశారు. టీటీడీ గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాదాపు 200మంది నిపుణులు ఈ అలంకరణ పనుల్లో పాల్గొన్నారు.

ఇస్రో రామబాణం పీఎస్ఎల్వీ

నేటి 60వ ప్రయోగానికి షార్‌లో సర్వం సిద్ధం

ఉదయం 9.10గంటలకు నింగిలోకి దూసుకెళ్లనున్న పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్





షార్ ప్రయోగ వేదికపై పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ - ఎక్స్‌పో శాట్ ఉపగ్రహం

సూళ్లూరుపేట, డిసెంబరు 31:రాకెట్ ప్రయోగాల్లో తిరుగులేని శక్తిగా భారత్ ఎదగడంలో పీఎస్ఎల్వీ విజయాలదే పెద్దపీట.ఇస్రో గురితప్పని రామబాణంగా పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్(పీఎస్ఎల్వీ) పేరుగాంచింది.ఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీ వంటి చిన్న సౌండింగ్ రాకెట్ల ద్వారా చిన్న ఉపగ్రహాలనే పంపుతుండిన మన శాస్త్రవేత్తలు బరువైన ఉపగ్రహాలను పంపాలనే ఉద్దేశంతో ప్రయత్నాలు ప్రారంభించారు.1993లో పీఎస్ఎల్వీ ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. నాలుగు దశల్లో ఉన్న ఈ రాకెట్ బరువైన ఉపగ్రహాలను సులువుగా అంతరిక్షంలోకి మోసుకెళ్తోంది.ఈ రాకెట్ల ద్వారా విదేశీ ఉపగ్రహాలను కూడా అలవోకగా పంపే స్థాయికి ఇస్రో ఎదిగింది. ఇప్పటివరకూ 59 ప్రయోగాలు చేపట్టారు.వీటిలో మూడు ప్రయోగాలు మినహా అన్నీ విజయవంతమయ్యాయి.పైగా 47 ప్రయోగాల్లో ఇస్రో వరుసగా జైత్రయాత్ర సాగించింది. చంద్రయాన్-1, మార్స్ ఆర్బిటల్ మిషన్ వంటి కీలక ప్రయోగాలతో పాటు విదేశీ ఉపగ్రహాలను కూడా తీసుకెళ్లడం ద్వారా పీఎస్ఎల్వీ వాణిజ్యపరంగా కూడా భారత్‌కు పేరు తెచ్చిపెట్టింది. విదేశాలు చిన్న ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా పంపడానికి ఉత్సాహం చూపుతున్నాయి. ఇప్పటి వరకు 33 దేశాలకు చెందిన 319 ఉపగ్రహాలను ఇస్రో విజయవంతంగా ప్రయోగించి వాణిజ్యపరంగా మంచి లాభాలను ఆర్జించింది.సోమవారం షార్ నుంచి ప్రయోగించే పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ 60వ ప్రయోగం కావడం విశేషం.ఎక్స్‌పో శాట్ ఉపగ్రహాన్ని కూడా పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా పంపేందుకు ఇస్రో దీంతో శ్రీకారం చుట్టనుంది.ఈ నేపథ్యంలో షార్‌లో సందడి వాతావరణం నెలకొంది. భారీ భద్రత నడుమ సోమవారం ఉదయం 9.10గంటలకు ప్రయోగం జరగనుంది.షార్ చుట్టుపక్కల సీఐఎస్ఎఫ్ బలగాలతో పాటు సముద్ర మార్గాన కోస్టల్ గార్డులతో భద్రతను కట్టుదిట్టం చేశారు.

చెంగాళమ్మ ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

సూళ్లూరుపేట, డిసెంబరు 31: చెంగాళమ్మ ఆలయ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాలచంద్రారెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.





గూడూరులో కోలాటం ఆడుతూ, కోటలో నృత్యాలు చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఆటపాటలతో అంగన్వాడీల నిరసన

గూడూరు, డిసెంబరు 31: సీఎం జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీలు రిలే దీక్ష నిర్వహించారు. కోలాటం ఆడుతూ, నృత్యాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీఎం జగన్ అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. 20 రోజులుగా అంగన్వాడీలు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరించడం మంచి పద్ధతికాదన్నారు. సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంద్రావతి, ప్రభావతి, ఆషియా, వజ్రమ్మ, మంగమ్మ, కోటమ్మ, శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, గోపినాథ్, చంద్రయ్య పాల్గొన్నారు.



వెంకటగిరిలో అంత్యాక్షరి ఆడుతున్న అంగన్వాడీలు

వెంకటగిరి: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు కార్యకర్తలు చేస్తున్న దీక్ష ఆదివారం కూడా కొనసాగింది. అంగన్వాడీలు కోలాటం, అంత్యాక్షరి ఆడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో వడ్డిపల్లి చెంగయ్య, మంజుల, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

కోట: కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అంగన్వాడీలు నృత్య ప్రదర్శన చేస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నాయుడుపేట టౌన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు సమ్మె నిర్వహిస్తున్నారు. ఆదివారం ఇంకెన్నిరోజులు శిబిరంలో భోజనం చేయాలంటూ నినాదాలు చేస్తూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివకవి ముకుంద, మునిరాజ, కళావతి, నాగమణి, మేరీ ప్రమీల, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. అంగన్వాడీలు ఆట, పాటలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు హైమావతి మాట్లాడుతూ 20రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. తమ డిమాండ్లను అంగీకరించేవరకు పోరాటం ఆగదన్నారు.

చెంగాళమ్మకు ఇస్రో చైర్మన్ పూజలు



చెంగాలమ్మ ఆలయంలో ఇస్రో చైర్మన్, షార్ డైరెక్టర్

సూళ్లూరుపేట, డిసెంబరు 31: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని ఆదివారం ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ దర్శించుకొన్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో కలిసి ఆలయానికి విచ్చేసి ఆయన శ్రీహరికోట నుంచి సోమవారం ప్రయోగించే పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ విజయవంతం కావాలని పూజలు చేశారు. ఆయనకు ఆలయ చైర్మన్ దువ్వూరు బాల చంద్రా రెడ్డి, ఈవో శ్రీనివాసులు రెడ్డి స్వాగతం పలికారు. పూజలనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల ఇస్రో చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ ద్వారా మన దేశానికి చెందిన ఖగోళ పరిశోధనల నిమిత్తం ఎక్స్‌పో శాట్ ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపుతున్నట్లు తెలిపారు. కౌంట్‌డౌన్ ప్రారంభమై సజావుగా జరుగుతోందన్నారు. 2024 సంవత్సరంలో తొలి రోజే ఇస్రో రాకెట్ ప్రయోగం చేపట్టి విజయంతో ఈ ఏడాదికి శుభారంభం పలుకుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు షార్ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ ఉన్నారు.

చెంగాళమ్మ సేవలో కలెక్టర్ దంపతులు



కలెక్టర్ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఈవో

సూళ్లూరుపేట, డిసెంబరు 31: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మను కలెక్టర్ వెంకట రమణారెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకొన్నారు. వారికి ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి స్వాగతం పలికి దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మునిచంద్ర, తహసీల్దార్ రవికుమార్, పాలక మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి, కర్లపూడి సురేష్, ఓలేటి బాల సత్యనారాయణ, బండి సునీత, మన్నెముద్దు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న నెలవల

సూళ్లూరుపేట, డిసెంబరు 31: పారిశుధ్య కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేయడం తగదని టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ కార్మికులు గొంతెమ్మ కోర్కెలేవి కోరడం లేదని, ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడుగుతున్న పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించి సమాన వేతనం ఇస్తామన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులకు టీడీపీ తరఫున రూ.15 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, బీసీ సెల్ నాయకులు చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు, వేనాటి జనార్ధన్ రెడ్డి, శ్రీనివాసుల నాయుడు, బండారు ఆంజనేయులు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.



గూడూరులో ఒంటికాళ్లపై నిలబడి పారిశుధ్య కార్మికుల నిరసన - వెంకటగిరిలో అర్ధనగ్నగా ప్రదర్శన

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

గూడూరు, డిసెంబరు 31: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 6వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరంలో పారిశుధ్య కార్మికులు ఒటికాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సమ్మెలో ఉన్న కార్మికులను కాదని ఇతరులను తీసుకువచ్చి పనులు చేయించడం మంచిపద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో గోపినాథ్, శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, చంద్రయ్య, పెంచలప్రసాద్, ప్రసాద్, సంపూర్ణమ్మ, మురళి, రాగయ్య, కిషోర్, వెంకటరమణ, సుబ్బమ్మ, మణెమ్మ, పోలమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని మున్సిపల్ కార్యాయం ఎదుట పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం ఆరవ రోజు కొనసాగింది. కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపత్తి చెంగయ్య స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో పాలకులు జాప్యం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బయ్య, ప్రసాద్, మంజుల, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు 6 రోజులుగా సమ్మె నిర్వహిస్తుంటే ప్రభుత్వానికి చలనంలేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివకవి ముకుంద, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గూడూరు వైసీపీ టికెట్ స్థానికులకే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

గూడూరు, డిసెంబరు 31: గూడూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించాలని చిట్టమూరు మండల అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆదివారం గూడూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో ఎంతో మంది నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేస్తున్నారన్నారు. ఓ అధికారికి వైసీపీ టిక్కెట్ కేటాయించున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందన్నారు. ఇప్పటికే ఓ విశ్రాంత అధికారిని ఎమ్మెల్యే చేయడంతో పార్టీ శ్రేణులకు ప్రాధాన్యం లేకుండా పోయిందని, మళ్లీ మరో అధికారికి టిక్కెట్ ఇస్తే తమకు విలువ ఉండదని అభిప్రాయపడ్డారు. పార్టీ శ్రేణులతో చర్చించి స్థానికుడికి టికెట్ కేటాయిస్తే అందరూ కష్టపడి గెలిపించుకుంటామని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు పేరు ప్రస్తావించకుండా ఆయనకు అవకాశం ఇవ్వాలని ఆకాంక్షించారు. కాగా, అధిష్టానం టికెట్ ఎవరికి కేటాయించినా మీరు పనిచేస్తారా లేదా అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఓ నాయకుడు దురుసుగా సమాధానం చెప్పడంతో విలేకరులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బొమిడి శ్రీనివాసులు, సంపత్‌కుమార్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, రాజారెడ్డి, కాంద్ర నారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, మొబీన్ బాషా, గోపి, రవీంద్ర, గఫూర్ పాల్గొన్నారు.

పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 31: పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్స్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నాయుడుపేటలో అసోసియేషన్స్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంధన శాఖ ఉద్యోగులకు నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. అలాగే పీఆర్సీ, సర్వీస్ ఇంక్రిమెంట్స్, డీఏ, హెచ్ఆర్ఏ, ఇన్సూరెన్స్, రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ అమలుకు సంబంధించిన నిర్ణయాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పద్మనాభయ్య, సెక్రటరీ పుల్లయ్య, సభ్యులు తులసీ, ప్రసాద్, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

పాలచ్చూరులో ఉచిత వైద్య శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు సందీప్, దీప్తి

పెళ్లకూరు, డిసెంబర్ 31: నాయుడుపేట పట్టణంలోని ట్రినిటీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని పాలచ్చూరు గిరిజన కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కీళ్లు, మోకాళ్లు, నడుము నొప్పి, నరాల బలహీనత, కీళ్ల వాతం, చిన్నపిల్లలకు సంబంధించిన సమస్యలకు చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ చైర్మన్ ఆదవరం నాగూరయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సందీప్, దీప్తి, లతీఫ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పరుగుపందెం పోటీలకు ఎన్‌బీకేఆర్ విద్యార్థి

కోట, డిసెంబరు 31: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న హిమతేజ అంతర్జాతీయ పరుగుపందెం పోటీలకు ఎంపికయ్యాడు. రెండు రోజుల క్రితం మహారాష్ట్రలోని చంద్రపూర్ స్టేడియంలో జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రం తరపున పాల్గొని 100 మీటర్ల పరుగుపందెంలో విజేతగా నిలిచాడు. ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, అధ్యాపకులు శారద షీల్డ్‌లతో హిమతేజను అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

తడ, డిసెంబరు 31: కారు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని గ్రద్ధగుంట గ్రామానికి చెందిన నవీన్ ఆదివారం మధ్యాహ్నం సమయంలో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్లే కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

గూడూరు, డిసెంబరు 31: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ నారాయణ రాజు అన్నారు. ఆదివారం స్థానిక కళాశాలలో జరిగిన క్రీడాపోటీల్లో గెలిపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల గూడూరు జోన్ క్రికెట్ పోటీలను మూడు రోజులుగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పోటీల్లో ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల జట్టు విజయం సాధించగా వెంకటగిరికి చెందిన వైష్ణవి డిగ్రీ కళాశాల జట్టు రన్నర్‌గా నిలిచిందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కృష్ణమూర్తి, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.